నమస్తే తెలంగాణ
జగిత్యాల
8 | కరీంనగర్, శనివారం 24 మే 2025 | JAGTIAL

నామాపూర్‌లో మల్లికార్జున స్వామి ఆలయ ప్రతిష్ట వేడుకల్లో పాల్గొని మొక్కతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

ముస్తాబాద్‌లో కేటీఆర్

ముస్తాబాద్ మే 23 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం ముస్తాబాద్ మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. మండలకేంద్రంతో పాటు బందనకల్, నామాపూర్, చిప్పలపల్లి, కొండాపూర్, గూడెం, ఆవునూరు గ్రామాల్లో జరిగిన పలు శుభకార్యాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వదించారు. ఇటీవల మరణించిన పలువురి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నామాపూర్‌లో శ్రీ వరాల మల్లికార్జున స్వామి ఆలయ ప్రతిష్ట వేడుకల్లో పాల్గొని, గ్రామస్తులను ఆప్యాయంగా పలుకరించారు.

మోహన్‌రావుపేటలో కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కొనుగోళ్లలో విఫలం

ప్రభుత్వంపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఆగ్రహం

కోరుట్ల రూరల్, మే 23 : ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మండిపడ్డారు. శుక్రవారం కోరుట్ల మండలంలోని మోహన్‌రావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. వరి కోసి నెల రోజులు దాటినా ఇప్పటికి వరకు ధాన్యం కొనడం లేదని ఆగ్రహించారు. వేగంగా కొంటున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్ప ఎక్కడా సమర్థవంతంగా జరగడం లేదన్నారు. అకాల వర్షాలతో వడ్లు తడిసి ముద్దవుతున్నాయని, మొలకెత్తి రైతులు తీవ్రంగా నష్టపోయి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు నియోజకవర్గంలో తూకం వేసిన ధాన్యం బస్తాల నిల్వలు అలాగే ఉన్నాయని, లారీల కోసం రైతులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ముమ్ముందు మరిన్ని వర్షాలు కురుస్తాయని, అప్పుడు ధాన్యం పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, బస్తాలను మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు చీటి వెంకట్రావ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ ఆర్ ఎస్.. క్రమబద్ధీకరణ కోసం ప్లాట్ యజమానుల కష్టాలు

- కట్టిన ఫీజు తిరిగొస్తుందా.. లేదా..? అన్నదానిపై స్పష్టత కరువు
- కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు
- లేవుట్‌లోని ఒక ప్లాట్‌పై వివాదం ఉంటే అన్నింటికీ వర్తింపు
- ఎన్‌వోసీ సమర్పించినా ఎదురుచూపులే
- ఇదే అదనుగా అధికారులు వసూళ్లకు దిగుతున్నారనే ఆరోపణలు
- పెండింగ్‌లో 52 శాతం దరఖాస్తులు

ఫీజు చెల్లించిన తర్వాత దరఖాస్తులు రిజెక్ట్!

ఏదీ పరిష్కారం?

అనధికారిక ప్లాట్లు, అక్రమ లేఅవుట్లు క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతున్నది. అవకాశం ఇచ్చినట్టే ఇచ్చి కొత్త తిరకాసు పెడుతుండడంతో దరఖాస్తుదారులు ముప్పుతిప్పలు పడాల్సి వస్తున్నది. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం కరువవుతున్నది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది అప్లికేషన్స్ క్లియర్ చేయకపోవడం విమర్శలకు తావిస్తున్నది. మరోవైపు లేవుట్‌లోని ఒక ప్లాట్‌పై వివాదం ఉంటే.. దానిని ఆ సర్వేనంబర్ మొత్తానికి అన్వయిస్తూ క్రమబద్ధీకరణ చేయడం లేదు. 'నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్' సమర్పించినా సమస్య కొలిక్కి రావడం లేదు. ఇంకోవైపు ఇంటిమేషన్ లెటర్ ఇచ్చి పేమెంట్ చేసిన తర్వాత వందలాది దరఖాస్తులను రిజెక్ట్ కింద చూపడంపై ఆందోళన వ్యక్తమవుతున్నది. కట్టిన డబ్బులు పరిస్థితి ఏంటో తెలియక దరఖాస్తుదారులు అయోమయంలో కొట్టుమిట్టాడుతుండగా, ఈ తరహా సమస్యలు పరిష్కరించడానికి ప్రతి మున్సిపల్ పరిధిలో అనుభవమున్న సీనియర్ అధికారి అధ్వర్యంలో ఫిర్యాదు సెల్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వస్తున్నది.

కరీంనగర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో అనధికారిక లేవుట్ల ద్వారా వేలాది ప్లాట్స్ విక్రయం జరిగింది. వీటిని క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ 2020ని అమల్లోకి తెచ్చింది. ఉమ్మడి జిల్లాలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో 1,13,346 దరఖాస్తులు వచ్చాయి. కరీంనగర్ సూడా పరిధిలో 21,042 దరఖాస్తులు వచ్చాయి. నిబంధనల ప్రకారం 2020 అక్టోబర్ 31 నాటికి ఆన్‌లైన్‌లో రూ.వెయ్యి చెల్లించిన దరఖాస్తుదారుల భూములను క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం ఇప్పుడు అవకాశం కల్పించింది. దీంతో దరఖాస్తుదారులు తమ స్థలాలు, ప్లాట్స్‌ను ఎల్ఆర్ఎస్ చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇక్కడ అనేక కొర్రీలతో ఆగమవుతున్నారు. నిజానికి ఒక లేవుట్‌లో ఒక ప్లాట్‌పై వివాదం లేదా కోర్టు కేసులు ఉంటే.. అందులోని మొత్తం ప్లాట్స్‌కు దానిని అన్వయిస్తున్నారు. సదరు ప్లాట్స్‌పై ఎటువంటి వివాదం లేదని పేర్కొంటూ దరఖాస్తుదారులు సంబంధిత సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) సమర్పిస్తున్నారు. అయినా సమస్య ఒక కొలిక్కి రావడం లేదు. ఎన్‌వోసీ సమర్పించిన కొంత మందికి పని అవుతున్నా.. మరికొంత మందికి రిజెక్టు అవుతున్నది. ఇదేంటని అధికారులను ప్రశ్నిస్తే.. 'మా చేతుల్లో ఏమీ లేదు. అది సాఫ్ట్‌వేర్ లోపం' అంటూ దాటవేస్తున్నారు. ఎల్ఆర్ఎస్ సాఫ్ట్‌వేర్ కూడా అప్‌డేట్ కాకపోవడం దరఖాస్తు దారుల పాలిట శాపంలా మారుతున్నదన్న విమర్శలు వస్తున్నాయి. ఉదాహరణకు.. ఒక లేఅవుట్‌లోని ఒక ప్లాట్ మీద వివాదముంటే దానిని ఆ ప్లాట్ వరకే పరిమితం చేసే సాఫ్ట్‌వేర్ లేదు. ఆ వివాదాన్ని సర్వేనంబర్ మొత్తానికి అన్వయించడం వల్ల వందలాది ప్లాట్స్ క్రమబద్ధీకరణకు నోచుకోలేని దుస్థితి ఏర్పడుతుంది. ఈ విషయంలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసి, సర్వే నంబర్‌లోని ప్లాట్స్‌వారీగా క్రమబద్ధీకరణ చేసే విధంగా అవకాశం కల్పించాలని పలు మున్సిపాలిటీలనుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లినా ఇప్పటివరకు ఎటువంటి స్పందన లేదు. ఆదిశగా చర్యలూ చేపట్టడం లేదు. దీంతో ఒక ప్లాట్ వివాదం ప్రభావం సదరు సర్వే నంబర్‌లోని అన్ని ప్లాట్స్‌పై పడుతున్నది.

ఫీజు కట్టిన తర్వాత తిరస్కరణ

ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తుదారులు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లను ముందుగా ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. వాటిని పరిశీలించి సదరు ప్లాట్ క్రమబద్ధీకరణ చేయడానికి అర్హత ఉందా.. లేదా..? అన్నది అధికారులు ముందుగా గుర్తించాలి. ఏమైనా అనుమానాలు ఉంటే పూర్తిస్థాయి పరిశీలన చేయాలి. అన్ని నిబంధనల ప్రకారం ఉన్నాయని భావించిన తర్వాత మాత్రమే ఫీజు ఇంటిమేషన్ లెటర్ ఇవ్వాలి. సదరు ఫీజు పేమెంట్ లెటర్ అధారంగా దరఖాస్తుదారుడు.. అందులో పేర్కొన్న మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి. నిబంధనల ప్రకారం ప్లాట్ క్రబద్ధీకరణ చేయడానికి ఆస్కారం లేకపోతే ఫీజు పేమెంట్ లెటర్‌కు ముందే రిజెక్టు చేయాలి. తద్వారా రిజెక్టుకు గల లోపాలను దరఖాస్తుదారులు చూసుకొని, అందుకు అనువైన పత్రాలు సమర్పించి తిరిగి అప్‌లోడ్ చేసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఒక సారి ఫీజు చెల్లింపు లెటర్ వచ్చిదంటే వందశాతం క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి కావాల్సిందే. కానీ, మెజార్టీ కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో అలా జరగడం లేదు. ఫీజు పేమెంట్ లేటర్ ఆధారంగా సంబంధిత మొత్తాన్ని చెల్లించిన తర్వాత దరఖాస్తు రిజెక్ట్ అయినట్టు చూపుతున్నది. ఇటువంటి దరఖాస్తులు కరీంనగర్ పరిధిలోనే దాదాపు 200కుపైగా ఉన్నట్టు బాధిత దరఖాస్తుదారులు చెబుతున్నారు. ఫీజు చెల్లించిన తర్వాత రిజెక్టు అయితే దరఖాస్తుదారుడు చెల్లించిన అమౌంట్ మొత్తం సదరు దరఖాస్తుదారుడికి ఖాతాకు జమ కావాలి. ప్రస్తుతం అలా కాకుండా ప్రభుత్వ ఖాతాలోనే సదరు సొమ్ము ఉంటుంది. ఇటు క్రమబద్ధీకరణ కాక.. అటు ప్రభుత్వానికి చెల్లించిన డబ్బులు తిరిగి ఖాతాల్లో జమ కాక.. అధికారుల నుంచి ఈ విషయంపై స్పష్టత రాక దరఖాస్తుదారులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. అసలు వస్తాయో.. రావో అని ఆందోళన చెందుతున్నారు.

ఎల్ ఆర్ఎస్ కోసం మున్సిపాలిటీల వారీగా వచ్చిన దరఖాస్తులు

కార్పొరేషన్/మున్సిపల్	దరఖాస్తులు
కరీంనగర్	26,850
రామగుండం	7,078
హుజూరాబాద్	3,981
జమ్మికుంట	5,904
చొప్పదండి	1,472
కొత్తపల్లి	2,666
జగిత్యాల	8,003
మెట్‌పల్లి	6,538
కోరుట్ల	9,143
రాయికల్	1,898
ధర్మపురి	1,011
పెద్దపల్లి	9,675
సుల్తానాబాద్	1,531
మంథని	894
సిరిసిల్ల	10,492
వేములవాడ	16,216

సాకులు.. ముడుపులు?

ఎల్ఆర్ఎస్ సాఫ్ట్‌వేర్‌లో ఉన్న అనేక లొసుగులు.. కొంతమంది అధికారులకు కాసుల పంట పండిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దరఖాస్తును పూర్తిస్థాయిలో ముందుగా పరిశీలించకుండానే అధికారులు రిజెక్టు కింద చూపిస్తున్నారు. దీంతో హైరానా చెందుతున్న సదరు దరఖాస్తుదారులు అధికారుల వెంట పడుతున్నారు. ఇదే అదనుగా భావిస్తూ కొంత మంది అధికారులు.. మరింత భయభ్రాంతులకు గురి చేసి వసూళ్లకు దిగుతున్నారు. కొన్ని బల్దియాల్లో అందుకోసం కొంత మంది ప్రత్యేక ఏజెంట్లు పనిచేస్తున్నారనే విమర్శలున్నాయి. అడిగిన మొత్తం ఇవ్వకపోతే ప్లాట్స్ ఓనర్స్ భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని భయపెడుతుండటంతో సదరు యజమానులు ముడుపులు ఇచ్చి పనులు ఆయ్యేలా చూసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ తరహా సమస్యలు పరిష్కరించడానికి ప్రతి మున్సిపల్ పరిధిలో ఒక ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న డిమాండ్ వస్తున్నది. ఈ దిశగా చర్యలు తీసుకుంటే దరఖాస్తుదారులు నిత్యం అధికారుల చుట్టూ తిరిగే ఇబ్బందులు తప్పడంతోపాటు సమస్యను ప్రత్యేక సెల్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం ఆయ్యేలా చూసుకునే అవకాశం ఏర్పడుతుంది. ఎల్ఆర్ఎస్‌లో వస్తున్న సమస్యలపై ప్రత్యేక ఫోకస్ పెట్టకపోతే దరఖాస్తుల పరిష్కారానికి మరిన్ని నెలలు పడుతుంది.

పేమెంట్ తర్వాత రిజెక్ట్?

కరీంనగర్ జిల్లాకేంద్రానికి చెందిన ప్రభుత్వోద్యోగి ఒకరు తిమ్మాపూర్ మండలంలోని సర్వేనంబర్ 266, 278లో ప్లాట్ నంబర్ 49, 51ని కొన్నాడు. మొత్తం విస్తీర్ణం 475.68 చదరపు గజాలు కాగా, జోగిరెడ్డి అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేశాడు. అప్పట్లో లేఅవుట్ చూపించి విక్రయించారు. అది అనధికారిక లేవుట్ అని తెలుసుకున్న సదరు ఉద్యోగి, క్రమబద్ధీకరణ కోసం 2020 సెప్టెంబర్24న రూ. వేయి చెల్లించి దరఖాస్తు చేసుకున్నాడు. ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని పరిగణలోకి తీసుకొని, ఎల్ఆర్ఎస్‌కు ముందుగా ప్రయత్నం చేయగా సైట్‌లో ప్లాట్ వివాదంలో ఉన్నట్టు చూపింది. తన ప్లాట్‌పై ఎటువంటి వివాదం లేదని పేర్కొంటూ మార్చి 27న సంబంధిత సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి ఎన్‌వోసీ తీసుకొని, సదరు డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేశాడు. వాటిని పరిశీలించిన అధికారులు, ఆ మేరకు సంబంధిత స్థలానికి ఫీజు పేమెంట్ కోసం మార్చి 28న ఇంటిమేషన్ లెటర్ ఇచ్చారు. ఆ ప్రకారం సదరు ఉద్యోగి అదే రోజు ఫోన్‌పే ద్వారా ₹49,780 ఆన్‌లైన్ ద్వారా చెల్లించాడు. వారం పాటు సదరు అధికారులు పరిశీలిస్తున్నట్టు చూపిన సైట్ ప్రస్తుతం రిజెక్ట్ కింద చూపుతున్నది. ఇదే విషయాన్ని సదరు ఉద్యోగి సంబంధిత అధికారులతో మాట్లాడితే.. 'ఇలా చాలా అవుతున్నాయి. వీటిపై విధి విధానాలు రావాల్సి ఉన్నది. మేం ఇప్పుడేమి చేయలేం' అని చెబుతున్నారు. పోనీ కట్టిన డబ్బుల సంగతి ఏంటని ప్రశ్నిస్తే.. 'పదిశాతం కట్ అయి మిగిలిన డబ్బులు మీ ఖాతాకే జమ అవుతాయి' అని సమాధానమిస్తున్నారు. అవి కూడా ఎప్పుడు వస్తాయో తెలియదని చెపుతున్నారు. ఇది ఒక ప్రభుత్వోద్యోగి సమస్య మాత్రమే కాదు, ఉమ్మడి జిల్లాలో వేలాది మంది ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఎదుర్కొంటున్న ఇబ్బంది!

ఇంకెప్పుడు కొంటరు?

మొలకలు చూపుతున్న రైతు దుందిగాల శంకరయ్య

ఎల్లారెడ్డిపేట, మే 23: వెంకటాపూర్‌కు చెందిన రైతు దుందిగాల శంకరయ్య, ఇరువై రోజుల క్రితం అదే గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రం సబ్ సెంటర్‌కు 120 క్వింటాళ్ల ధాన్యం తెచ్చాడు. అప్పటి సంది కొనకపోవడంతో నిత్యం ఆగమవుతున్నాడు. వర్షం వచ్చిన ప్రతిసారీ వణికిపోతున్నాడు. మబ్బు లు పడ్డప్పుడల్లా కవర్లు కప్పుడు.. మళ్లీ ఎండరాగానే ఆరోబోస్తుడు.. చేస్తున్నాడు. గురువారం పడ్డ అకాల వర్షంతో కుప్ప తడిసిందని, వడ్లు మొలకెత్తాయని కంటతడి పెడుతున్నాడు. ఇంకెప్పుడు వడ్లను కొంటరు? వడ్లన్నీ తడిసిన తర్వాత కొంటరా..? అని ప్రశ్నిస్తున్నాడు. ధాన్యం వేగంగా కొనాలని, రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

గంభీరావుపేట, మల్లారెడ్డిపేట కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన వడ్లను చూపిస్తున్న రైతు భిక్షపతి

మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న దాచారం రైతులు

మొలకెత్తిన ధాన్యం

కొనుగోలు కేంద్రాల్లో తడుస్తున్న వడ్లు

గంభీరావుపేట/ మెట్‌పల్లి రూరల్, మే 23 : నాలుగైదు రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి మొలకెత్తుతున్నది. దీంతో రైతులు దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. కొనుగోళ్లు, కాంటా వేసిన బస్తాలను తరలించడంలో జాప్యం చేస్తుండడంతో నష్టపోవాల్సి వస్తున్నదని ఆవేదన చెందుతున్నారు. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట కొనుగోలు కేంద్రం వద్ద రైతులు మొలకెత్తుతున్న వడ్లను చూపిస్తూ.. కేంద్రానికి వడ్లు తీసుక వచ్చి నెల రోజులు అయితున్నదని, ప్రభుత్వం ఇప్పటి వరకు కొనకపోవడంతో తమ రెక్కల కష్టం వర్షం పాలవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గ్రామంలో స్థానిక పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండడంతో ఇటీవలి వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతున్నది. నెలరోజుల క్రితం తీసుకొచ్చినా.. ధాన్యం తేమ శాతం వచ్చినా ఇప్పటికీ కొనకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. వారం రోజుల క్రితం తూకం వేస్తామని చెప్పడంతో కొందరు ధాన్యాన్ని బస్తాల్లో నింపగా, వర్షానికి అవి తడిచి అందులోనే మొలకెత్తుతున్నది. దీంతో ధాన్యాన్ని మళ్లీ ఆరబెడితేనే తూకం వేస్తామని కేంద్రం నిర్వాహకులు తేల్చడంతో అన్నదాతలు ఆందోళనలో పడ్డారు. కొనుగోళ్లలో జాప్యం జరగడం వల్లే తమకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మూడుసార్లు బస్తాలు తడిసినయి

నేను రెండు నెలల కింద మామిడిపల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రంలో సన్నవడ్లు పోసిన. నాతో పాటు చాలా మంది రైతులు సెంటర్‌లో పోసిన్రు. నిర్వాహకులు ధాన్యం తూకం వేసి నిల్వ ఉంచిన్రు. అకాల వర్షాలతో ధాన్యం బస్తాలు పూర్తిగా తడిసిపోతున్నాయి. ఇప్పటికే మూడుసార్లు తడిశాయి. నిర్వాహకులను బస్తాలను తీసుకెళ్లాలని అడిగితే మిల్లులు కేటాయించలేదని చెప్తున్నరు. కలెక్టర్ సారు స్పందించాలి. సన్నపు వడ్లను తరలించేలా చూడాలి.

-తీపిరెడ్డి మహేందర్‌రెడ్డి, రైతు, మామిడిపల్లి (కోనరావుపేట)

మెట్‌పల్లి రూరల్: బండలింగాపూర్ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

కోనరావుపేట: వట్టిమల్లలో మొలకెత్తిన వరిధాన్యం

రైతన్న ఆగ్రహం

- తడిసిన ధాన్యం కొనాలని ఆందోళనలు
- మొలకెత్తిన వడ్లతో రోడ్డెక్కి నిరసనలు
- ధర్మపురి- జగిత్యాల ప్రధాన రహదారిపై ధర్నా

రైతులు ఆగ్రహించారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. మొలకెత్తిన ధాన్యంతో పలుచోట్ల రోడ్డెక్కి ఆందోళనలకు దిగారు. కొనుగోళ్లలో ప్రభుత్వం జాప్యం చేస్తుండడంతోనే తాము నష్టపోవాల్సి వస్తున్నదని, సరైన సమయంలో కొనుగోలు చేస్తే ఇలా తడిసేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోళ్లను వేగంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

జగిత్యాల రూరల్: ధర్మపురి- జగిత్యాల ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

జగిత్యాల రూరల్, మే 23 : జగిత్యాల అర్బన్ మండలంలోని గోపాల్‌రావుపేట ఐకేసీ సెంటర్‌లో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మొలకెత్తిన ధాన్యంతో ధర్మపురి జగిత్యాల ప్రధాన రహదారిపై శుక్రవారం ధర్నా చేశారు. సుమారు 40 నిమిషాలపాటు ఆందోళన చేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న అర్బన్ తహసీల్దార్ రామ్మోహన్, ఎస్ఐ సదాకర్ అక్కడికి చేరుకొని సర్ది చెప్పినా రైతులు ససేమిరా అనడంతో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత ధర్నా వద్దకు చేరుకున్నారు. తడిసిన ధాన్యం ఆరబెట్టిన తర్వాత కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

రాయికల్: రైతులతో కలిసి ధర్నా చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

రాయికల్, మే 23 : తడిసిన ధాన్యం వెంటనే కొనాలని రాయికల్ మండలం సింగారావుపేట- శ్రీరామ్‌నగర్ గ్రామాల రైతులు సింగర్‌రావుపేట- జగిత్యాల రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. అంతకు ముందు తడిచిన వడ్లను జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. రైతులు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న తహసీల్దార్ గణేశ్ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు కొనుగోళ్లు త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఆంక్షల్లేకుండా కొనాలి

జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత

అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా వెంటనే కొనాలని జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం చేతికి అందేలోగా అకాల వర్షాలతో తడిసి ముద్దయిందని, అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లోనే మొలకెత్తే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ ప్రభుత్వం రైతును రాజు చేస్తానని రోడ్డు పాలు చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వమని, ధాన్యం కొనాలని రైతులు రోడ్లపై ఎక్కడికక్కడ ధర్నాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేసిందని, తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసిన ఘనత కేసీఆర్‌దేనని గుర్తు చేశారు. ధర్నాలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బర్కం మల్లేశ్ యాదవ్, నాయకులు చాంద్, రాజేశ్వర్ రెడ్డి, జలపతి రెడ్డి, గంగారెడ్డి, రాజమౌళి, చంద్రయ్య, శ్రీను, రవి, మల్లారెడ్డి, నరేష్, లక్ష్మణ్, రైతులు, మహిళలు పాల్గొన్నారు.